
# పగపేటికి పాలు బిందిననే...

ఇచ్ఛాపురపు రామచంద్రం



ప్రమాదో ధీమతా మపి....

బుద్ధిమంతులకి కూడా తప్పని ప్రమాదం - సామాన్యులకెందుకు తప్పుతుంది?

ఆ కుర్రవాడు బుద్ధిమంతుడిలాగే ఉన్నాడు. చిదిమిన పాల్గారు అన్నట్లు లేత బుగ్గలూ.. పదేళ్ళ ప్రాయమూ మోకాలిపైదాకా వరకూ నిక్కరూ....మామూలు చేతుల చొక్కా... హిప్పీక్రాపు కాకుండా- ముఖం కనిపించే చిన్న జుత్తూ....అలాగ. యత్ర రూపం తత్ర గుణాః అన్నారు గనుక-ఆ బాలుణ్ని చూసి బుద్ధిమంతుడనుకోడంలో విపరీతమేమీ ఉండదు.

రెండుచేతులు కలిస్తే కాని చప్పట్లు కానట్లే —

రెండు కలిస్తే కాని ప్రమాదమూకాదు. ప్రమాదం అనే దానిని - రెండు, లేదా అంత కంటె ఎక్కువ వస్తువులు కాని... ఇద్దరు మనుషులు... లేదా... ఒక పదార్థమూ ఒక వ్యక్తికాని... యిలాగ...వీటి లేదా వీరిమధ్యా-జరిగే ఢీ కొను కార్యక్రమంగా నిర్వచించవొచ్చు స్థూలంగా.

ఆ బాలుణ్ని - సైకిలు ఢీ కొట్టింది.

సైకిలు మీదున్నవాడు ముప్ఫయ్యేళ్ళ పై బడిన వాడేకాని - ధీమంతుడిలా కనిపించడం లేదు. అతనికి- ముగ్గు బుట్టంత తలకట్టుంది. చెవుల కిందికి .... చెంపలమీదుగా...దాదాపు మీసాల కొసలతో ముద్దులు పెట్టుకుంటున్నాయా అనిపించే సైడ్ బర్న్స్ ఉన్నాయి. చీరేమో అనిపించే ఎర్రపువ్వుల లుంగీమీద—ఆకుపచ్చని బనియన్ లాటి దాన్ని ధరించిన అతన్ని చూస్తే-తెలుగు తెరనుంచి జారిపడిన రౌడీ అనే అనిపిస్తుంది. కానీ సదభిప్రాయం కలగదు. మిన్నూ మన్నూ చూసుకోనంత వేగంగా అతను తన వాహనమయిన సైకిలుని నడుపుతూండబట్టే... వేగము మృత్యువు. నిదానమే ప్రధానము. మెల్లగా గమ్యమును చేరుము, తొందరపడి స్వర్గమును చేరకుము.... వంటి రాస్తా సూక్తులను పెడ చెవిన పెట్టబట్టే

ఆ ద్విచక్రశకటం - పదేళ్ళబాలుణ్ని ఢీ కొనడం - అతను పక్కకి పడిపోవడమూ....రెప్పపాటులో జరిగిపోయింది. నా కన్నుల ముందరే. మనిషి పతన మయ్యాక కాని వివేకమూ పశ్చాత్తాపమూ కలుగనట్లే సమయం దాటి...పరిస్థితి ముదిరి... ప్రమాదం జరిగాక కాని సైకిలుకి బ్రేకులు పట్టవు. చేతులు కాలాక, ఆకులు పట్టుకునీ; బాలుణ్ని గుద్దేశాక బ్రేకులు పట్టుకునీ ఏం లాభం?

కుర్రవాడు- రాళ్ళు పొదుముకు వొచ్చిన రోడ్డుమీద పడిపోవడమేమిటి, సైకిలాగింది...చేయవలసిన ఘనకార్యమంతా చేసేసి ఏమీ ఎరుగని నంగనాచిలా.... వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రిని గద్దె దింపిన ఎమ్మెల్యేలా.

అతను-

రౌడీ రూపంలా ఉన్నా - మామూలు మనిషినే...మనసూ మంచితనమూ ఉన్నవాడినేసుమా అని నిరూపించుకుంటున్నట్లు ...తాను సైకిలు దిగి...దాన్ని వొదిలేసి... బాలుణ్ని లేవనెత్తి... "దెబ్బ తగిలిందా బాబూ?" అని అడిగాడు అనునయంగా.

ఒక్కక్షణం... జరిగిన దేమిటో అర్థంకానట్లు....అయోమయంగా - "లేదు" అన్నట్లు తలూపాడబ్బాయి.

అమ్మయ్య అనుకున్నాను-నేనూను మనసులో.

ఎంత సేపు?

మహాఅయితే-ముచ్చటగా ముప్ఫయ్ సెకండ్లు

ఆ అబ్బాయి కెవ్వుమన్నాడు.

సైకిలు వాలాతో పాటు నేనూ ఉలిక్కిపడ్డాను.

కుర్రవాడి మోకాలి దిగువ _ చర్మం గీరుకుపోయి - రక్తం కారుతోంది!

నాకు తెలుసు. దెబ్బతగిలిన తక్షణం బాధ తెలియదు. మత్తెక్కడానికి లాగే బాధ తెలియడానికి కూడా కొంత సమయం తీసు

కుంటుంది పచ్చని మోకాలిమీద-ఎర్రనీర్రక్తం. జాలేసింది. ఎంత బాధ పెడుతూందో ఆ గాయం - పాపం !

ఆ కుర్రాడు – రోడ్డుమీద కూర్చుండి పోయి.... నేలవేపు చూస్తూ - ఏడుస్తున్నాడు. అతనికి కొంచెం దూరంగా. స్టీలు కారియర్ ఒంటిగిన్నెది పగటి వేళ భార్యాభర్తలలా-విడివిడిగా ఎడముఖం పెడ ముఖంగా గిన్నె.... మూత. దిక్కు - తెలియనిపిల్లల్లా ఏం చేయాలో తోచని ఆ దంపతుల సంతానంలా నలుమూలలా పరుగెడుతున్న ప్రవహిస్తున్న - (పిల్ల) పాల్ల కాలువలు. పాలు నేలపాలయ్యాయి.

కుర్రాడికెంత బాధగా ఉందో - వెక్కెక్కి ఏడుస్తున్నాడు.

అప్పటికే - నాతోపాటు నలుగురూ చేరారు,

రాడీ - సహజంగానే అంతమంచివాడో... లేక యీపరిస్థితిలో బయట పడటానికి మంచి తనం కంటె మరోమార్గంలేదనో...." దా బాబూ... డాక్టరు దగ్గరకి తీసుకువెళ్ళి మందు వేయిస్తాను." అన్నాడు.

అప్పటికే-నలుగురూ-సైకిలు వాలామీద కోపాన్నీ, బాలుడి మీద సానుభూతినీ ధారాళంగా ప్రదర్శించేస్తున్నారు.

సైకిలెక్కితేచాలు కళ్ళు మూసుకుపోతాయి. ఎంత స్పీడుగా తొక్కితే అంత గొప్పయిపోయింది. చూసుకోరు -

సైకిలువాలా మీద జాలివేస్తూంది నాకు ఎందుకంటే -జరిగిన దేమిటోనేను ప్రత్యక్షంగా చూశాను. తప్పు - సైకిలు వాలాది కాదు. కుర్రాడు సైకిలు మీదకు వొచ్చాడు. కానీ సైకిలు కుర్రాడి మీదకి రాలేదు. అదీ సత్యం. కాని నేను దానిని బయట పెట్టే వెర్రి పనిచేయ దలుచుకోలేదు. ప్రజలస్సానుభూతి అంతా, దెబ్బతిన్నవాడిమీదా, తల్లి ప్రేమంతా చెడిపోయిన కొడుకు మీదా-మాత్రమే ఉంటాయన్న సహజ సత్యం నాకు బాగా తెలుసు. అదీగాక యిక్కడ... నేను చెప్పబోయే నిజం వల్ల ఉపయోగ మ్ముండదు.

"కుర్రాడు చూస్తూ చూస్తూ మళ్ళీ నీ సైకిలెలా ఎక్కుతాడు ? చేసిన నిర్వాకం చాలదూ ?

"అదికాదు.... దెబ్బకి మందువేయించి. టెట్ వాక్ ఇంజక్షని ప్పించి..." కర్తవ్యం నిర్వర్తిస్తున్నట్లు చెప్పాడుసైకిలువాలా మెల్లగా భయపడుతూనే.

"ఆ బాధలేవో అబ్బాయి తల్లి తండ్రులే పడతారుకానీ - ఓ పదిరూపాయలిచ్చెయ్... మందుఖర్చుకి" ఎవరో సూచించారు.

బ్రతుకు జీవుడా అనుకున్నట్లుంది సైకిలువాలా. ఛటుక్కున జేబులోంచి పదిరూపాయలనోటు తీసి అందించాడబ్బాయికి.

సైకిలు యజమాని చేయిదాటి-మరెవరి ఆధీనంలోనో ఉంది.

అబ్బాయి-పదిరూపాయల నోటందుకున్నాడు-ఏడుస్తూనే.

ఇంక తనసైకిలిచ్చేసి - యీ పరిస్థితినుండి విముక్తుణ్ని చెయ్యమన్నట్లు - తన సైకిలుని అధీనంలోకి తీసుకున్న పెద్దమనిషి వేపు చూశాడు సైకిలువాలా.

"పాలు పట్టుకెళ్ళకుండా గడప తొక్కితే వీపు చీరేస్తాడు నాన్న. అవి- కాఫీ పాలు" ఏడుస్తూ.... భయంగా అన్నాడు దెబ్బ తిన్న బాలుడు. నిజమే.... పాలు వొలికినందు కొక చింత. నాన్న వీపు చీరేస్తాడన్ని అసలు చింత. సరే, కాలుమీది చర్మం చీరుకుపోయిన బాధ ఎలాగూ ఉండనే ఉంది.

ఆ నాన్నెవడో నాలాటి వాడే. కాఫీ గత ప్రాణిలా ఉన్నాడు. కొందరు- 'కోపమొస్తే మనిషినికా 'నంటారు. కోపం రాకపోయినానూ అని సన్నగా చమత్కారంగా చురకవేస్తాడు మా మిత్రుడు. లేచే సరికి, కన్ను తెరిచేసరికి కాఫీ అందకపోతే నాలాగే ఆ అబ్బాయి నాన్నకీ వొళ్లు తెలియదు కాబోలు.

"ఎన్ని పాలవి ?"

"లీటరు ?" చెప్పాడు అబ్బాయి,

"వెళ్ళి- పాలుకొని, అబ్బాయిని యింటివద్ద దింపెయ్." అని ఎవరో పెద్ద మనిషి సమస్యా పరిష్కారం చేసేశాడు సత్వరంగా.

అమ్మయ్య అనుకొని, సైకిలువాలా అబ్బాయిని సైకిలెక్కమని- క్యారేజి హేండిల్ కి తగిలించి తెరిచిన పాలక్షేత్రం వేపు లాగించేశాడు. .... యిబ్బందికరమయిన ఆ సన్నివేశంనుంచి బయట పడితే అదే పదివేలన్నట్లు.

అబ్బాయి- చిరునవ్వు చిందిస్తున్నాడు.

ఇప్పుడతని ముఖంలో ఏ బాధాలేదు! కథలో పస, పట్టు లేకపోతే ఏం ?